సాక్షి
విశాఖపట్నం


అన్నా.. మేము సిద్ధం


ఆత్మీయనేతకు పుష్పాభిషేకం

బుధవారం ׀ 6 ׀ మార్చి ׀ 2024

అపూర్వ స్వాగతం

నగరంలో జరిగిన కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అపూర్వ స్వాగతం లభించింది. రాడిసన్ బ్లూ హోటల్ ముందు కార్యకర్తలు, అభిమానులు సిద్ధం ప్లకార్డులు ప్రదర్శించి స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి కాన్వాయ్‌పై పూలు చల్లుతూ తమ అభిమానాన్ని చాటుకున్నారు.



వీ-కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి జగన్ సమక్షంలో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుంటున్న వివిధ సంస్థల ప్రతినిధులు


విశాఖ పరిపాలన భవన నమూనాను ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్

న్యూస్‌రీల్

అనకాపల్లి జిల్లాలో సీఎం జగన్ పర్యటన ఖరారు

రేపు పిసినికాడలో 'చేయూత' నిధులు విడుదల చేయనున్న ముఖ్యమంత్రి

సాక్షి, అనకాపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఈనెల 7న అనకాపల్లి జిల్లాకు రానున్నారు. ఈ మేరకు మంగళవారం పర్యటన షెడ్యూల్ అధికారికంగా ఖరారయింది. సీఎం ప్రత్యేక విమానంలో ఉదయం 10.20 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టుకు వస్తారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 10.45 గంటలకు కశింకోట మండలం ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు. స్థానిక ప్రజాప్రతినిధులతో 10 నిమిషాల పాటు ముచ్చటిస్తారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన ప్రయాణించి 11.15 గంటలకు పిసినికాడ వద్ద గల సభా వేదిక వద్దకు చేరుకుంటారు. 11.20 గంటలకు వేదికపై మహానేత వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తారు. 11.40 గంటల నుంచి 12.40 గంటల వరకు గంట పాటు సీఎం ప్రసంగిస్తారు. అనంతరం వైఎస్సార్ చేయూత చివరి విడత నిధుల పంపిణీని బటన్ నొక్కి ప్రారంభిస్తారు. మహిళామార్ట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి అవార్డులు ప్రదానం చేస్తారు. మధ్యాహ్నం 12.55 గంటలకు బయలుదేరి కశింకోటలో హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు. గంటసేపు ప్రజాప్రతినిధులతో ముచ్చటించిన అనంతరం 2.10 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడ నుంచి 2.35 గంటలకు విమానంలో గన్నవరం ఎయిర్‌పోర్టుకు తిరుగు పయనమవుతారు.

అప్పన్న హుండీ ఆదాయం రూ.1.93కోట్లు


హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి హుండీ ఆదాయం రూ.1,93,77,877 వచ్చినట్టు సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. సింహగిరిపై మంగళవారం హుండీ ఆదాయాన్ని లెక్కించారు. నగదుతో పాటు 136.350 గ్రాముల బంగారం, 11.420 కిలోల వెండి లభించినట్టు ఈవో వెల్లడించారు. సింహగిరిపై ఉన్న యాత్రిక సదన్‌లో ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన లెక్కింపులో దేవస్థానం అధికారులు, సిబ్బంది, పలు స్వచ్ఛంద సంస్థలకు చెందిన సభ్యులు పాల్గొన్నారు.

ఎంఎస్‌ఎంఈ ఎక్స్‌పో-24కు సర్వం సిద్ధం


ప్రదర్శనకు సిద్ధమవుతున్న స్టాల్స్

అక్కిరెడ్డిపాలెం: బుధవారం, గురువారం నిర్వహించనున్న ఎంఎస్‌ఎంఈ ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్‌కు ఆటోనగర్‌లోని ఎంఎస్‌ఎంఈ ఫెసిలిటేషన్ కార్యాలయ ఆవరణ సిద్ధమైంది. ఎగ్జిబిషన్‌ను అనకాపల్లి ఎంపీ డాక్టర్ భీశెట్టి వెంకట సత్యవతి, బీజేపీ ఎంపీ జీవీఎల్ నర్సింహారావు, ఎంఎస్‌ఎంఈ నేషనల్ బోర్డు మెంబర్ పి.విష్ణుకుమార్ రాజు ముఖ్య అతిథులుగా ప్రారంభించనున్నారని ఎంఎస్‌ఎంఈ ఏడీ, ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ ఏ.శ్రీను తెలిపారు. ఎగ్జిబిషన్‌లో పారిశ్రామిక ఉత్పత్తుల ప్రదర్శన, పలు ప్రభుత్వ రంగ సంస్థలు, వివిధ బ్యాంకులకు సంబంధించి 40 స్టాళ్లు సిద్ధం చేస్తున్నారు. ప్రారంభ కార్యక్రమంలో ఎంఎస్‌ఎంఈ – డీఎఫ్‌వో డి.చంద్రశేఖర్, స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్, బీడీఎల్ జీఎం ఆర్.సింహాచలం, హిందూస్తాన్ షిప్‌యార్డ్ డైరెక్టర్ ఎస్.వి.రాంబాబు, ఎన్ఆర్‌డీసీ సీనియర్ మేనేజర్ బిజయ్ కుమార్ సాహూ, డీఐసీ జీఎం సీహెచ్.గణపతి, వాసీవా అధ్యక్షులు సజ్జా పాండురంగ ప్రసాద్, ఐలా చైర్మన్ కె.సత్యనారాయణ రెడ్డి (రఘు) పాల్గొంటారు.

పలు రైళ్ల దారి మళ్లింపు

తాటిచెట్లపాలెం: దక్షిణ మధ్య రైల్వే గుంతకల్ డివిజన్, తిరుపతి స్టేషన్ ఆధునికీకరణ పనుల్లో భాగంగా ఈ మార్గంలో ప్రయాణించే పలు రైళ్ల దారి మళ్లిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం త్రిపాఠి తెలిపారు. ఈ నెల 11, 18 తేదీల్లో బయల్దేరే ఎస్ఎంవీటి బెంగళూరు–టాటానగర్(12890) ఎక్స్‌ప్రెస్ వయా కాట్పడి, అరక్కోణం జంక్షన్, రేణిగుంట మీదుగా నడుస్తుంది. ఈ నెల 12,14,19,21 తేదీల్లో బయల్దేరే ఎస్ఎంవీటీ బెంగళూరు -హతియా (12836) సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ వయా కాటప్డి, ఆరక్కోణం జంక్షన్, రేణిగుంట మీదుగా నడుస్తుంది. ఈ నెల 16వ తేదీన బయల్దేరే మంగళూరు సెంట్రల్-సంత్రగచ్చి (22852) వివేక్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ వయా కాట్పడి, అరక్కోణం, రేణిగుంట మీదుగా నడుస్తుంది.

విశాఖపై

ఇదీ జగన్ విజన్

- నగర రూపురేఖలు మార్చేలా 'విజన్ విశాఖ' ప్రకటన
- ఐదు విభాగాల వారీగా అభివృద్ధి
- రూ.లక్షా 5 వేల కోట్ల వ్యయంతో ప్రణాళికలు
- ప్రమాణ స్వీకారమూ విశాఖలోనేనని ప్రకటన
- వైజాగ్‌పై సీఎం మమకారం.. నగర వాసుల్లో హర్షాతిరేకం


విజన్ విశాఖ ప్రజెంటేషన్‌ను వీక్షిస్తున్న సీఎం జగన్, మంత్రులు బొత్స, రజని, ముత్యాలనాయుడు, అమర్, సురేష్


జీవీఎంసీలో అభివృద్ధి పనుల శంకుస్థాపన అనంతరం నమూనా చిత్రాలు పరిశీలిస్తున్న సీఎం జగన్

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

ప్రపంచ పటంలో విశాఖను ఠీవిగా నిలబెట్టేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన విజన్‌ను స్పష్టంగా ప్రకటించారు. రానున్న ఐదేళ్ల కాలంలో విశాఖ నగర కేంద్రంగా చేపట్టే అభివృద్ధి పనులు, వచ్చే పెట్టుబడులు, జరిగే కార్యక్రమాలను వివరిస్తూ ఆయన విడుదల చేసిన 'విజన్ విశాఖ'పై సర్వత్రా చర్చ జరుగుతోంది. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై నగరాలకు దీటుగా.. విశాఖ అభివృద్ధికి ఉన్న అవకాశాలను ముఖ్యమంత్రి వివరించిన తీరు.. సమావేశానికి హాజరైన పారిశ్రామికవేత్తలు, వాణిజ్యవర్గాలతో పాటు నగరవాసులను ఆకట్టుకుంది. విశాఖ నగర అభివృద్ధిని అడ్డుకునేందుకు ప్రతిపక్షాలతో పాటు పచ్చపత్రికలు విషం కక్కుతున్న తీరును ఆయన సూటిగా ఎత్తిచూపారు.

'విజన్ విశాఖ'లో భాగంగా ఏపీ డెవలప్‌మెంట్ డైలాగ్ విత్ సీఎం కార్యక్రమం, విద్యార్థుల్లో నైపుణ్యం పెంచేందుకు వీలుగా భవిత కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు తాడేపల్లి నుంచి సీఎం వైఎస్ జగన్ మంగళవారం ఉదయం నగరానికి చేరుకున్నారు. రాడిసన్ బ్లూ హోటల్‌లో నిర్వహించిన 'విజన్ విశాఖ'లో సీఎం ప్రసంగించారు. రాష్ట్రాభివృద్ధిలో భాగంగా నగరాభివృద్ధిని వివరించిన తీరు అటు పారిశ్రామికవేత్తలను ఇటు వ్యాపారవర్గాలను ఆకట్టుకుంది. కేవలం మాటలతోనే సరిపెట్టకుండా.. ఈ సందర్భంగా నగరంలో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు ఇదే వేదికగా ఆయన శంకుస్థాపనలు కూడా చేశారు. ఎన్నికల తర్వాత విశాఖలోనే ప్రమాణ స్వీకారం చేస్తానని.. ఇక్కడి నుంచే పరిపాలిస్తానంటూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన ప్రకటనతో నగరవాసుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. విశాఖ నగరంపై ఆయనకున్న ప్రేమను మరోసారి నగరవాసులు గుర్తు చేసుకున్నారు. అనంతరం పీఎంపాలెంలోని వీ-కన్వెన్షన్‌లో భవిత కార్యక్రమాన్ని ప్రారంభించి.. యువతనుద్దేశించి మాట్లాడారు. పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా చదువుకునే సమయంలోనే విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టడం అభినందనీయమని పారిశ్రామికవేత్తలు కొనియాడారు.

ఐదేళ్లు.. ఐదు విభాగాలు

విశాఖ నగరాన్ని ప్రపంచపటంలో ప్రముఖంగా నిలబెట్టేందుకు వీలుగా రానున్న ఐదేళ్ల కాలంలో ఐదు ప్రధాన విభాగాల్లో చేపట్టనున్న అభివృద్ధి ముఖ చిత్రాన్ని సీఎం జగన్ ఆవిష్కరించారు. సుమారు రూ.1,05,000 కోట్లతో ఏయే విభాగాల్లో ఎంత మేర వ్యయం చేయనున్నామనే అంశాన్ని పేర్కొన్నారు.

- కనెక్టివిటీ
- ఇండస్ట్రియల్ ల్యాండ్ స్కేప్
- అర్బన్ ప్లానింగ్, సిటీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్
- సోషల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్
- స్థిర అభివృద్ధి- పర్యావరణ సమతుల్యత

విశాఖ.. ఎకనామిక్ గ్రోత్ ఇంజిన్

రాష్ట్ర అభివృద్ధికి ఒక గ్రోత్ ఇంజిన్ అవసరమని.. అది విశాఖపట్నమేనని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రకటించారు. రాష్ట్ర ఆర్థిక వనరుల పెంపుతో పాటు పారిశ్రామికంగా, సర్వీసురంగ పరంగా.. విద్య, వైద్యంతో పాటు హోటల్స్ ఇలా అన్ని రంగాల్లో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నిలబెట్టే సత్తా విశాఖ నగరానికి ఉందని సీఎం పేర్కొనడాన్ని నగరవాసులు ఆహ్వానించారు. విశాఖ నగర అభివృద్ధి ముఖ చిత్రాన్ని ఈ సందర్భంగా ఆయన స్పష్టంగా ఆవిష్కరించారు. ఇందుకోసం ఇప్పటికే చేపడుతున్న కార్యక్రమాలతో పాటు చేపట్టబోయే అంశాలను వివరించారు. రాష్ట్రాభివృద్ధిలో విశాఖ ప్రాధాన్యం, పరిపాలన రాజధానిగా ఎందుకు విశాఖను ఎంపిక చేశామో.. సీఎం వివరించిన తీరు అందరినీ ఆకట్టుకుంది. సదస్సుకు హాజరైన పారిశ్రామిక, వాణిజ్య వర్గాలు సీఎం విజన్‌ను మెచ్చుకున్నారు. విశాఖను కీర్తిస్తూ సీఎం ప్రసంగించిన ప్రతీసారి సభికుల నుంచి కరతాలధ్వనులతో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కో–ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వై.వి.సుబ్బారెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజని, మంత్రులు బొత్స సత్యనారాయణ, గుడివాడ అమర్‌నాథ్, ఆదిమూలపు సురేష్, ఎంపీలు ఎంవీవీ సత్యనారాయణ, బి.వి.సత్యవతి, మేయర్ హరి వెంకటకుమారి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, తిప్పల నాగిరెడ్డి, కరణం ధర్మశ్రీ, అదీప్‌రాజ్, ఉమాశంకర్ గణేష్, కంబాల జోగులు, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, డీసీసీబీ చైర్మన్ కోలా గురువులు, వైఎస్సార్ సీపీ విశాఖ పార్లమెంట్ సమన్వయకర్త బొత్స ఝాన్సీ, నెడ్‌క్యాప్ మాజీ చైర్మన్ కె.కె.రాజు, పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీలక్ష్మి, కలెక్టర్ మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, ఏసీఏ కార్యదర్శి గోపీనాథ్‌రెడ్డి, ఏయూ వీసీ ప్రసాదరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి




రాడిసన్ బ్లూలో జరిగిన విజన్ విశాఖ కార్యక్రమానికి హాజరవుతున్న పారిశ్రామిక, వాణిజ్యవేత్తలు


వీ- కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, విద్యావేత్తలు, విద్యార్థులు

మారిటైం సెక్టార్‌లో విప్లవాత్మక మార్పులే లక్ష్యం

విశాఖ పోర్టు చైర్మన్ అంగముత్తు


మాట్లాడుతున్న పోర్టు ట్రస్ట్ చైర్మన్ అంగముత్తు

బీచ్‌రోడ్డు: మారిటైం సెక్టార్‌లో విప్లవాత్మకమైన మార్పులు తీసుకురావడమే లక్ష్యమని విశాఖ పోర్టు ట్రస్ట్ చైర్మన్ అంగముత్తు వెల్లడించారు. నగరంలోని ఓ హోటల్‌లో విశాఖపట్నం పోర్టు అథారిటీ ఆధ్వర్యంలో పరస్పర సహకారం, ప్రణాళిక, అమలు చేయడం అనే అంశంపై మంగళవారం సదస్సు జరిగింది. ఈ సందర్భంగా పోర్టు చైర్మన్ మాట్లాడుతూ భవిష్యత్తులో పోర్టు అభివృద్ధికి అవసరమైన బాటలు వేయడం, సామర్థ్యాన్ని పెంపొందించడం కోసం సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడం, స్థిరత్వం, పోర్టు కనెక్టివిటీ వంటి అంశాలను మెరుగుపరచుకునేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఉన్నత పరిశ్రమలు, విద్యావ్యవస్థలు, ప్రభుత్వ విభాగాలతో భాగస్వామ్యాలు పెంపొందించుకోవడంలో పోర్టు కృతనిశ్చయంతో ఉందన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా కార్బన ఉద్గారాలను తగ్గించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. పోర్టు నిర్వహణకు అవసరమైన విద్యుత్‌ను పునరుత్పాదక శక్తి ద్వారా సమకూర్చుకుంటున్నట్లు వెల్లడించారు. అనంతరం పోర్టు సామాజిక బాధ్యతలో భాగంగా లబ్ధిదారులకు రూ.3.63 కోట్ల విలువైన చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ కార్యదర్శి యువరాజ్, నగర పోలీస్ కమిషనర్ ఎ.రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

భూకబ్జాలు, భూ తగాదాలపై స్పెషల్ డ్రైవ్ నేడు

అల్లిపురం: భూ కబ్జాలు, భూ తగాదాల తదితర సమస్యలపై బుధవారం ఉదయం 10.30 గంటల నుంచి ఒంటి గంటల వరకు ప్రతీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు స్వీకరించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు సీపీ రవిశంకర్ తెలిపారు. భూ కబ్జాదారులపై పూర్తి విచారణ జరిపి వారు చేస్తున్న అక్రమాలను గుర్తించి.. వారిపై పీడీ యాక్ట్ నమోదు చేయడం, అవసరాన్ని బట్టి నగర బహిష్కరణకు సిఫార్సు చేయాలని ఉన్నతాధికారులను ఆదేశించినట్లు చెప్పారు. ఫిర్యాదుల స్వీకరణకు ప్రతీ స్టేషన్‌లో ఓ ఉన్నతాధికారి అందుబాటులో ఉంటారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పోలీస్ స్టేషన్ల వారీగా ఇన్‌చార్జిలు

పీఎంపాలెం	జాయింట్ సీపీ	కంచరపాలెం	క్రైం ఏసీపీ
భీమిలీ	డీసీపీ-1	ఎంవీపీ	ద్వారకా ఏసీపీ
దువ్వాడ	డీసీపీ-2	త్రీటౌన్	ఎస్బీ ఏసీపీ
ఆరిలోవ	డీసీపీ క్రైం	ఎయిర్‌పోర్టు	సీసీఎస్ ఏసీపీ
ఆనందపురం	ఎస్‌బీ ఏడీసీపీ	వన్ టౌన్	ట్రాఫిక్ ఏసీపీ 2
గాజువాక	ట్రాఫిక్ ఏడీసీపీ	టూ టౌన్	టాస్క్‌ఫోర్స్ ఏసీపీ
పెందుర్తి	క్రైం ఏడీసీపీ		
ద్వారకా	అడ్మిన్ ఏడీసీపీ	ఫోర్తు టౌన్	ఈస్ట్ ఏసీపీ
న్యూపోర్టు	ట్రాఫిక్ ఏసీపీ 1	మహారాణిపేట	దిశ ఏసీపీ
పద్మనాభం	నార్త్ ఏసీపీ	స్టీల్‌ప్లాంట్	సౌత్ ఏసీపీ
గోపాలపట్నం	వెస్ట్ ఏసీపీ	మల్కాపురం	హార్బర్ ఏసీపీ

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సాంకేతిక విద్య

మధురవాడ : ప్రభుత్వ పాఠశాల పిల్లలను ప్రపంచ స్థాయి విద్యార్థులుగా తయారు చేయడానికి ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా మంగళవారం అన్ని జిల్లాల్లోని విద్యాశాఖ అధికారులతో రాష్ట్ర ఉన్నతాధికారులు వర్చువల్ సమావేశం నిర్వహించారు. చంద్రంపాలెం జెడ్పీ హైస్కూల్‌లో జిల్లా విద్యాశాఖ అధికారులు, సమగ్ర శిక్ష అధికారులతోపాటు 8, 9 తరగతుల విద్యార్థులంతా ఏపీ విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాశ్ ప్రసంగాన్ని వీక్షించారు. ఈ మేరకు 'సెన్సిటైజేషన్ టూ ఫ్యూచర్ స్కిల్స్ ఎక్స్‌పర్ట్స్' పేరిట విద్యార్థులకు భవిష్యత్‌లో అందించాల్సిన సాఫ్ట్ స్కిల్స్‌పై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా డీఈవో చంద్రకళ మాట్లాడుతూ విద్యార్థులను సాంకేతికంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ఇంటర్నెట్ థింగ్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్లౌడ్ మేనేజ్‌మెంట్ తదితర విజ్ఞానాన్ని అందించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. డిజిటల్ రూపంలో సాంకేతిక విద్యను ప్రభుత్వం అందిస్తోందన్నారు. ఉపాధ్యాయులతోపాటు విద్యార్థులను సైతం ఇటువంటి సమావేశాల్లో భాగస్వాములను చేస్తున్నామని చంద్రకళ చెప్పారు. డిప్యూటీ డీఈవో గౌరీశంకర్, ఎంఈవో రవీంద్రబాబు, సమగ్రశిక్ష ఏపీసీ బి.శ్రీనివాసరావు, డైట్ కళాశాల అధ్యాపకులు గొట్టేటి రవి, చంద్రంపాలెం హెచ్ఎం ఎం.రాజబాబు పాల్గొన్నారు.

దేశంలోనే విశాఖకు ఎనలేని గుర్తింపు

- రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్
- ఇంటిగ్రేటెడ్ ఫైనాన్స్ భవన కాంప్లెక్స్ ప్రారంభం
- కలెక్టరేట్ వెనుక రూ.25.30 కోట్లతో నిర్మాణం


ఇంటిగ్రేటెడ్ ఫైనాన్స్ భవన కాంప్లెక్స్‌ను ప్రారంభిస్తున్న రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్, చిత్రంలో ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి షంషేర్ సింగ్ రావత్, రాష్ట్ర ఖజానా డైరెక్టర్ మోహనరావు

మహారాణిపేట: దేశంలో అన్ని ప్రాధాన్యతలు ఉన్న నగరంగా విశాఖకు గుర్తింపు ఉందని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ అన్నారు. కలెక్టర్ కార్యాలయం వెనుక రూ.25.30 కోట్ల వ్యయంతో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ ఫైనాన్స్ భవన కాంప్లెక్సును మంగళవారం ఆయన ప్రారంభించారు. అనంతరం భవన సముదాయాన్ని పరిశీలించి మాట్లాడారు. ఈ భవన సముదాయంలో ఆర్థిక శాఖకు సంబంధించిన అన్ని విభాగాలను తీసుకొచ్చే అవకాశం ఉందన్నారు. జిల్లా ట్రెజరీ శాఖ, పే అండ్ అకౌంటెంట్, ఆడిట్ విభాగం తదితర కార్యాలయాలను ఒకే కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేస్తామని మంత్రి వెల్లడించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశాఖ అభివృద్ధికి ప్రణాళిక ప్రకటించారని.. రానున్న రోజుల్లో విశాఖ పరిపాలన కేంద్రంగా మారనుందన్నారు. గడిచిన రెండేళ్లలో విశాఖలో అనేక రకాల మౌలిక సదుపాయాలు కల్పించినట్లు చెప్పారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్య శిక్షణ ఇవ్వాలన్న ప్రభుత్వ ఆలోచన యువతకి ఎంతో మేలు చేస్తుందన్నారు. భవిత ద్వారా యువతలో నైపుణ్యత పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఆర్థిక శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి షంషేర్ సింగ్ రావత్, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, రాష్ట్ర ఖజానా, లెక్కల శాఖ సంచాలకుడు ఎస్.మోహన్‌రావు, జిల్లా ట్రెజరీ అధికారి వై.సుధాకరరావు, అసిస్టెంట్ ట్రెజరీ అధికారులు(ఏటీవోలు) నాగార్జునరావు, నితిన్ జోషి తదితరులు పాల్గొన్నారు.

10న గురుకులాల్లో ప్రవేశ పరీక్ష

కంచరపాలెం: రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 5వ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు ఈ నెల 10న ఆదివారం పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి జిల్లాల గురుకులాల సమన్వయకర్త ఎస్.రూపవతి తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి విశాఖ జిల్లా పరిధిలోని 3 గురుకులాలు, అనకాపల్లి జిల్లా పరిధిలో 8 గురుకులాల్లో 5వ తరగతి, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలు కల్పిస్తామన్నారు. ఈ రెండు జిల్లాల్లో 5వ తరగతికి 880 సీట్ల కోసం 3,808, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో 880 సీట్ల కోసం 2,221 విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. ఆ రోజు ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు 5వ తరగతి అభ్యర్థులకు, సాయంత్రం 2 నుంచి 4.30 గంటల వరకు ఇంటర్ అభ్యర్థులకు పరీక్ష నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. 5వ తరగతి విద్యార్థులు https:// apbragcet. apcfss. in/ fifth-hallticket, ఇంటర్ విద్యార్థులు https:// apbragcet.apcfss.in/inter-hallticket వెబ్‌సైట్ ద్వారా హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని ఆమె సూచించారు. మరిన్ని వివరాలకు 0891–2799641లో సంప్రదించవచ్చు.



సీఎం వైఎస్ జగన్‌కు స్వాగతం పలుకుతున్న మేయర్ హరివెంకటకుమారి, మంత్రులు అమర్‌నాథ్, ముత్యాలనాయుడు, రజని, విశాఖ పార్లమెంట్ ఇన్‌చార్జి ఝాన్సీ

సీఎం జగన్‌కు ఆత్మీయ స్వాగతం



సీఎంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కలెక్టర్ మల్లికార్జున, సీపీ రవిశంకర్

గోపాలపట్నం: విశాఖలో పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు మంగళవారం వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. గన్నవరం నుంచి ప్రత్యేక విమానంలో 10.27 గంటలకు విశాఖ వచ్చిన సీఎం జగన్ 10.35 గంటలకు హెలికాప్టర్‌లో రుషికొండ బయలుదేరారు. ఆయనకు విమానాశ్రయంలో రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, కలెక్టర్ ఎ.మల్లికార్జున, వీఎంఆర్డీఏ చైర్మన్ సనపల చంద్రమౌళి, డీసీసీబీ చైర్మన్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, డీసీపీ సత్తిబాబు తదితరులు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. నగరంలో కార్యక్రమాలు ముగించుకుని తిరిగి సాయంత్రం 3.37 గంటలకు సీఎం జగన్ విమానాశ్రయానికి చేరుకున్నారు. ఇక్కడి నుంచి 3.43 గంటలకు గన్నవరం బయలుదేరారు.

కబడ్డీ విజేత తూర్పుగోదావరి జట్టు



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న నిర్వాహకులు

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల వేదికగా జరుగుతున్న 70వ సీనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ స్టేట్ కబడ్డీ పురుషుల కబడ్డీ విజేతగా తూర్పు గోదావరి జిల్లా జట్టు నిలిచింది. మంగళవారం రాత్రి ఫ్లడ్‌లైట్ల వెలుగుల్లో జరిగిన ఫైనల్ పోటీలో తూర్పుగోదావరి, గుంటూరు జట్లు తలపడ్డాయి. రెండు జట్ల క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ఒకానొక దశలో స్కోర్ సమమైంది. చివరి వరకు రెండు జట్లు సమానంగా పాయింట్లు సాధిస్తూ ఉత్కంఠగా ఆట సాగింది. చివరకు తూర్పు గోదావరి జిల్లా జట్టు 3 పాయింట్లతో గుంటూరు జట్టుపై పైచేయి సాధించి విజేతగా నిలిచింది. విజేత, రన్నరప్ జట్లకు ట్రోఫీలను ప్రదానం చేశారు. మూడో స్థానాన్ని కృష్ణా, శ్రీకాకుళం జట్లు సంయుక్తంగా సాధించాయి. సాయంత్రం జరిగిన మొదటి సెమీఫైనల్‌లో శ్రీకాకుళం జట్టుపై గుంటూరు జట్టు, రెండో సెమీ ఫైనల్‌లో కృష్ణా జిల్లా జట్టుపై తూర్పు గోదావరి జిల్లా జట్టు విజయం సాధించి ఫైనల్‌కి చేరాయి. విజేతలకు ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి వై.శ్రీకాంత్, విశాఖ జిల్లా కార్యదర్శి జె.ఎస్.వి ప్రసాద రెడ్డి, చీఫ్ పాట్రన్ ఎస్.రామకృష్ణారెడ్డి, ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు జి.వెంకటరెడ్డి ట్రోఫీలను ప్రదానం చేశారు. కబడ్డీ పోటీలను ఏపీ మారిటైం బోర్డు చైర్మన్ కాయల వెంకటరెడ్డి సందర్శించి క్రీడాకారులను అభినందించారు.



పాయింట్ సాధిస్తున్న గుంటూరు రైడర్

మినీ వ్యాను ఢీకొని వ్యక్తి మృతి



ప్రమాద స్థలంలో ఉమా మహేశ్వరరావు మృతదేహం

సింహాచలం: మినీ వ్యాను ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన సింహాచలం నుంచి గోపాలపట్నం వెళ్లే ప్రధాన రహదారిలో శ్రీనివాస నగర్ వద్ద మంగళవారం చోటుచేసుకుంది. గోపాలపట్నం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... జీవీఎంసీ 98వ వార్డు పరిధి అప్పన్నపాలెంలోని వర్షిణి అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న సిరిపురపు ఉమామహేశ్వరరావు (65) నగరంలోని ఆర్అండ్‌బీ దగ్గర ఉన్న ఆర్టీవో కార్యాలయం వద్ద ప్రైవేటుగా టైపిస్టు ఉద్యోగం చేస్తున్నారు. మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో ఇంటి నుంచి ద్విచక్ర వాహనంపై విధులకు వెళ్తున్నారు. అదే సమయంలో పద్మనాభం దరి మద్ది గ్రామం నుంచి ఇటుకుల లోడుతో మినీ వ్యాను సింహాచలం మీదగా గోపాలపట్నం వైపు వెళ్తోంది. శ్రీనివాసనగర్ వద్దకు చేరుకునేసరికి రోడ్డు పక్కన సింహాచలం దేవస్థానం వారు నిర్మిస్తున్న కల్యాణ మండపాల సముదాయం నుంచి ఒక బొలేరో వాహనం ఆకస్మాత్తుగా రోడ్డు మీదకి వచ్చింది. ఆ సమయంలో మినీ వ్యాన్‌ను డ్రైవర్ అదుపుచేయలేక ముందు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడు. దీంతో తలకు బలంగా గాయాలు కావడంతో సంఘటనా స్థలంలోనే ఉమా మహేశ్వరరావు మృతి చెందారు. ఉమా మహేశ్వరరావు కుమారుడు సిరిపురపు రవిసంతోష్ ఫిర్యాదు మేరకు గోపాలపట్నం ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి కారణమైన మినీ వ్యాన్ డ్రైవర్ మొకర గౌరునాయుడుని అరెస్ట్ చేశారు.

పాతికేళ్ల కల.. ఫలించనున్న వేళ

- జూనియర్ లెక్చరర్లుగా పీడీలకు ఉద్యోగోన్నతి
- 25 ఏళ్ల తరువాత ప్రమోషన్లకు లైన్ క్లియర్
- వివరాలు సత్వరమే పంపించాలని ఆర్జేడీ ఆదేశం
- సీనియారిటీ జాబితాలపై విద్యాశాఖ కసరత్తు
- వ్యాయామ విద్యకు ప్రభుత్వం ప్రాధాన్యం
- హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులు



విద్యార్థులకు క్రీడల్లో శిక్షణ ఇస్తున్న వ్యాయామ ఉపాధ్యాయుడు

విశాఖ విద్య: వ్యాయామ ఉపాధ్యాయులకు మంచి రోజులు వచ్చాయి. ప్రభుత్వ, జిల్లా పరిషత్ పాఠశాలల్లో ఫిజికల్ డైరెక్టర్లగా పనిచేస్తున్న వారి పదోన్నతులకు లైన్ క్లియరైంది. స్కూల్ అసిస్టెంట్ హోదాలో (ఫిజికల్ డైరెక్టర్) పనిచేస్తున్న తమకు జూనియర్ కాలేజీల్లో ఉద్యోగోన్నతి కల్పించాలని ఎన్నో ఏళ్లుగా చేస్తున్న పోరాటానికి ఫలితం దక్కే తరుణం ఆసన్నమైంది. ఉద్యోగోన్నతి కల్పించే నిమిత్తం జోనల్ స్థాయి సీనియార్టీ జాబితా తయారీపై విద్యాశాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. దీనిపై వ్యాయామ ఉపాధ్యాయులు సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

పాతికేళ్ల పోరాటం

వ్యాయామ ఉపాధ్యాయులకు అర్హత, సీనియార్టీ మేరకు ఉద్యోగోన్నతులు దక్కుతాయి. బీపీఈడీ అర్హతతో పీఈటీగా (సెకండరీ గ్రేడ్ టీచర్ హోదా) నియమితులైన వారికి ఫిజికల్ డైరెక్టర్ (స్కూల్ అసిస్టెంట్)గా ప్రమోషన్ లభిస్తోంది. మాస్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ (ఎంపీఈడీ) వంటి అదనపు అర్హత ఉన్నవారికి జూనియర్ కాలేజీల్లో లెక్చరర్‌గా అవకాశం కల్పించాలనే డిమాండ్ ఉంది. ఇలా 1998లో వ్యాయామ ఉపాధ్యాయులకు జూనియర్ కాలేజీల్లో లెక్చరర్‌గా ఉద్యోగోన్నతి కల్పించారు. ఆ తరువాత కాలంలో కొంతమంది న్యాయస్థానాన్ని ఆశ్రయించగా, దీనికి పరిష్కారం చూపేందుకు నాటి పాలకులెవరూ పెద్దగా పట్టించుకోలేదు. 30 ఏళ్లకు పైగా సర్వీసు చేసినా, ఉద్యోగోన్నతికి నోచుకోక అనేక మంది ఉపాధ్యాయులు నిరుత్సాహానికి లోనయ్యారు.

ఇన్నాళ్లకు మోక్షం

విద్యారంగానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. ఒత్తిడి లేని చదువులు సాగేలా పాఠశాలలు, కాలేజీల్లో వ్యాయామ విద్యకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈ నేపథ్యంలోనే అవసరమైన చోట వ్యాయామ ఉపాధ్యాయుల నియామక ప్రక్రియ నిరంతరం కొనసాగేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. వ్యాయామ ఉపాధ్యాయుల చిరకాల వాంఛను నెరవేర్చేందుకు సానుకూలత వ్యక్తం చేసింది. దీంతో ఎంపీఈడీ అర్హత గల వ్యాయామ ఉపాధ్యాయులకు జూనియర్ కాలేజీల్లో లెక్చరర్‌గా ఉద్యోగోన్నతి కల్పించేందుకు విద్యాశాఖ ఉన్నతాధికారులు కసరత్తు చేస్తున్నారు.

సమగ్ర వివరాల సేకరణ

ఎంపీఈడీ అర్హత గల వ్యాయామ ఉపాధ్యాయుల వివరాలను సత్వరమే పంపించాలని కమిషనర్ ఆదేశించడంతో, జిల్లా విద్యాశాఖ అధికారులు సమగ్ర వివరాలు సేకరిస్తున్నారు. విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల పరిధిలో అందుబాటులో ఉన్న నివేదికల మేరకు 40 మంది ఎంపీఈడీ అర్హత గల వారు ఉన్నట్లు జాబితా సిద్ధం చేశారు. జోనల్ స్థాయిలో సీనియార్టీ జాబితా తయారీ నిమిత్తం దీనిని ఆర్జేడీ కార్యాలయానికి నివేదించారు.

జాబితాలో చోటు కల్పించాలి



లెక్చరర్‌గా పదోన్నతి కల్పించాలని 25 ఏళ్లగా చేస్తున్న పోరాటం ఇన్నాళ్లకు నెరవేరుతోంది. చాలా సంతోషంగా ఉంది. ఇటీవల కాలంలో ఎంపీఈడీ అర్హతలు సాధించిన వారి పేర్లు కూడా జాబితాలో చేర్చాలి. అర్హత ఉన్న వ్యాయాయ ఉపాధ్యాయులందరికీ అవకాశం కల్పించాలి.

– కోట సతీష్, వ్యాయాయ ఉపాధ్యాయుడు, భీమునిపట్నం

సంతోషించదగ్గ విషయం



వ్యాయామ ఉపాధ్యాయులకు కాలేజీల్లో లెక్చరర్‌గా పదోన్నతి కల్పిస్తుండటం చాలా సంతోషించదగ్గ విషయం. వ్యాయామ విద్యకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోంది. ఇటీవల కాలంలో ప్రత్యేకంగా స్పోర్ట్స్ స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహిస్తుండటం వల్ల వృత్తి నైపుణ్యం పెరుగుతుంది.

–టి. నాగేశ్వరరావు, ఎస్జీఎఫ్ అధ్యక్షుడు, ఉమ్మడి విశాఖ జిల్లా

ఇన్ సర్వీసు శిక్షణ ఇస్తే అందరికీ మేలు



లెక్చరర్‌గా పదోన్నతి పొందడం అనేది గొప్ప విషయం. ఇది ఒకసారి మొదలైతే, అందరికీ గ్యారెంటీగా వస్తోంది. ఇన్‌సర్వీస్ కోటా ఎంపీఈడీ శిక్షణ ఇస్తే అందరికీ మేలు జరుగుతుంది. వేసవిలోనైనా ఇలాంటి శిక్షణ ఇచ్చేలా ఉన్నతాధికారులు ఆలోచించాలి.

– కె.నారాయణమ్మ, పీడీ, జెడ్పీ హైస్కూల్, పద్మనాభం

మహానేత ప్రతిమ బహూకరణ



సాక్షి, విశాఖపట్నం: పీఎంపాలెంలోని వైజాగ్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఏపీ ప్రభుత్వ సలహాదారుడు(స్కిల్ ట్రెనింగ్–జాబ్ ఫెయిర్) గాదె శ్రీధర్‌రెడ్డి కలుసుకున్నారు. మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రతిమను ఆయనకు బహూకరించారు. స్కిల్ డెవలప్‌మెంట్ సలహాదారుడు సిహెచ్ మధుసూదన్‌రెడ్డి, చైర్మన్ కె.అజయ్‌రెడ్డి, సీడాప్ చైర్మన్ ఎస్.శ్యాంప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

శివరాత్రికి భారీ ఏర్పాట్లు

దేవదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ శిరీష





నక్కవానిపాలెంలో శివాలయం (ఇన్‌సెట్) దేవదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ శిరీష

మహారాణిపేట: మహాశివరాత్రి సందర్భంగా ఈనెల 8న నగరంలోని శివాలయాల్లో విశేష పూజలు నిర్వహణకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. శివరాత్రి, ఆ తర్వాత రోజు భక్తులు దేవాలయానికి భారీగా తరలివస్తారు. దానికి తగ్గట్టుగా జిల్లా దేవదాయశాఖ ఏర్పాట్లు చేస్తోంది. మహాశివరాత్రి రోజున 5 వేల మంది భక్తులు వచ్చే దేవాలయాల్లో ప్రత్యేకంగా అన్ని శాఖల అధికారులతో సమన్వయ సమావేశాలు ఏర్పాటు చేశారు. భక్తుల సౌకర్యార్థం అధికారులతో చర్చించారు. సముద్ర తీర ప్రాంతాల్లో ఉన్న శైవ క్షేత్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గజ ఈతగాళ్లను ఏర్పాటు చేస్తున్నామని దేవదాయ శాఖ సహాయ కమిషనర్ కె.శిరీష చెప్పారు. ఇప్పటికే అన్ని శాఖల అధికారులతో శివరాత్రి ఏర్పాట్లపై చర్చించామన్నారు. శివరాత్రి నాడు శ్రీ దుర్గాలమ్మ దేవాలయం, అప్పికొండ శివాలయానికి 10 వేల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందన్నారు.

'న్యాయవాదుల సంఘం నుంచి వారిని తొలగించాలి'

విశాఖ లీగల్: ప్రస్తుత విశాఖ న్యాయవాదుల సంఘం కార్యనిర్వాహక కమిటీ సభ్యులు 17 మందితోపాటు, సంఘానికి చెందిన మరో 14 మంది సభ్యులను సంఘం నుంచి తొలగించాలని కోరుతూ జిల్లా ప్రధాన న్యాయస్థానంలో మంగళవారం పిటిషన్ దాఖలైంది. వారి నుంచి తనకు రూ.25 లక్షలు నష్టపరిహారం చెల్లించేలా ఆదేశించాలని కోరుతూ సీనియర్ న్యాయవాది వీడీవీఎస్ మూర్తి కోరారు. పిటిషన్‌పై తుది తీర్పు వెల్లడించే వరకు వీరిని త్వరలో జరగనున్న సంఘం వార్షిక ఎన్నికల్లో పాల్గొనకుండా నిరోధించాలని అనుబంధ పిటిషన్ వేశారు. పిటిషనర్ తెలిపిన వివరాలివీ.. గతంలో అంతర్ జిల్లాల న్యాయవాదుల క్రికెట్ టోర్నీలో ఆటగాళ్ల ఎంపికకు కమిటీని నియమించకుండా, నిర్వహణ పేరిట అనధికారికంగా నిధులు వసూలు చేశారని ఆరోపించారు. విశాఖ న్యాయవాదుల సంఘానికి చెందని వ్యక్తిని ఆటాడించారని, అతను ఆట మధ్య లో మరణించాడని తాను సంఘం దృష్టికి తీసుకొచ్చానని తెలిపారు. తప్పిదాలు పునరావృతం కాకుండా సర్వసభ్య సమావేశం ద్వారా నిబంధనలు రూపొందించాలని కోరామన్నారు. అయినప్పటికీ నిబంధనలు పరిగణనలోకి తీసుకోకుండా 2024 జనవరిలో జరిగిన రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నీకి ఆటగాళ్లను ఎంపిక చేశారని ఆరోపించారు. ఈ పిటిషన్‌పై ప్రాథమిక విచారణ అనంతరం జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రతివాదులకు నోటీసులు జారీ చేస్తూ తదుపరి విచారణ ఈ నెల 15కి వాయిదా వేసినట్లు తెలిపారు.

కారులో తరలిస్తున్న 80 కిలోల గంజాయి పట్టివేత



గంజాయి ప్యాకెట్లతో డీసీపీ -1 విజయ్ మణికంఠ

ఆనందపురం : కారులో తరలిస్తున్న గంజాయిని మండలంలోని బోయిపాలెం జంక్షన్ వద్ద మంగళవారం టాస్క్‌ఫోర్స్, ఆనందపురం పోలీసులు పట్టుకున్నారు. నిందితుల వద్ద నుంచి రెండు కార్లు, ఆరు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. విశాఖ డీసీపీ – 1 (లా అండ్ ఆర్డర్) విజయ్ మణికంఠ ఆనందపురం పోలీస్ స్టేషన్‌లో సంఘటనకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఒడిశా రాష్ట్రం, కోరాపుట్ జిల్లా, కొట్టంగి నుంచి రెండు కార్లలో గంజాయి తరలిస్తున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు టాస్క్‌ఫోర్స్, ఆనందపురం పోలీసులు మండలంలోని బోయిపాలెం జాతీయ రహదారిపై నిఘా పెట్టి వాహనాలు తనిఖీ చేశారు. తమకున్న సమాచారం మేరకు గంజాయి తరలిస్తున్న కార్లు బోయిపాలెం జంక్షన్ సమీపంలోకి వస్తున్నాయని తెలుసుకుని ముందుగా పోలీసులు ట్రాఫిక్ సిగ్నల్స్ నిలిపివేశారు. గంజాయి తరలిస్తున్న కారుకి ముందు ప్రయాణిస్తూ పైలట్‌గా వస్తున్న కారుని గుర్తించి పట్టుకున్నారు. ఆ వెనుకనే గంజాయితో ఉన్న కారు పైలట్ కారుని ఢీకొని పరారవడానికి ప్రయత్నించగా ఆనందపురం ఎస్ఐ సంతోష్, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది పట్టుకున్నారు. వాటిని తనిఖీ చేయగా వెనుక కారులో 80 కిలోలు బరువుండే 46 గంజాయి ప్యాకెట్లు లభ్యమయ్యాయి. రెండు కార్లలో ఉన్న వారిని పట్టుకోవడానికి ప్రయత్నించగా ఒకరు పరారు కాగా నలుగురు పట్టుబడ్డారు. వారి వద్ద ఉన్న 6 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు రెండు కార్లను, గంజాయి ప్యాకెట్లతో సహా ఆనందపురం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఒడిశా రాష్ట్రం, కోరాపుట్ జిల్లా గంగారాజ్‌పూర్ గ్రామానికి చెందిన హరాఖిలా(31), బసంత్ కుమార్ బంక(23), కొట్టంగి గ్రామానికి చెందిన రబినాగ్(22), కేరళ రాష్ట్రం కసరాగోడ్ జిల్లా ఉదినూర్ గ్రామానికి చెందిన సమీర్‌లను అరెస్ట్ చేశారు. రాజేష్ అనే యువకుడు పరారయ్యాడు. ఈ సందర్భంగా డీసీపీ – 1 విజయ్ మణికంఠ మాట్లాడుతూ పట్టుబడిన గంజాయి విలువ రూ.1.60 లక్షలు ఉంటుందన్నారు. గంజాయిని కేరళతోపాటు ఇతర రాష్ట్రాలకు తరలించడానికి నిందితులు ప్రణాళికలు వేశారన్నారు. ప్రేమసాయి అనే వ్యక్తితో నిందితులు సంబంధాలు కలిగి ఉన్నారని, అతను ఏ ప్రాంతానికి చెందిన వాడనే విషయమై ఆరా తీస్తున్నామన్నారు. పరారైన నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టామని వివరించారు. మీడియా సమావేశంలో ఆనందపురం సీఐ టీవీ తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

ఏపీపీటీడీ విజయనగరం జోన్ ఈడీ రవి కుమార్



మాట్లాడుతున్న విజయనగరం జోన్ ఈడీ రవికుమార్



19 డిపోల నుంచి హాజరైన మహిళా ఉద్యోగులు

సింహాచలం: ఏపీపీటీడీ (ఆర్టీసీ)లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి దృష్టి సారిస్తున్నామని ఏపీపీటీడీ విజయనగరం జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సి.రవికుమార్ అన్నారు. మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం ఏపీపీటీడీ ఎంప్లాయీస్ యూనియన్ విజయనగరం జోనల్ కమిటీ ఆధ్వర్యంలో సింహాచలంలో సమావేశం నిర్వహించారు. జోన్ పరిధిలోని విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లోని 19 డిపోల్లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈడీ రవికుమార్ మాట్లాడుతూ ఆర్టీసీలో విధులు నిర్వర్తించే మహిళా ఉద్యోగుల సమస్యలను ప్రత్యేకంగా పరిగణించి వాటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఏపీపీటీడీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీజేఏసీ అమరావతి రాష్ట్ర సెక్రటరీ పలిశెట్టి దామోదరరావు మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా 5,317మంది మహిళా ఉద్యోగులు ఆర్టీసీలో వివిధ కేటగిరీల్లో పనిచేస్తున్నారన్నారు. అందులో మహిళా కండక్టర్లే 4,589 మంది ఉన్నారన్నారు. మహిళా కండక్టర్లు చాలా ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వారి పాలిట మహిళా అధికారులు, సూపర్‌వైజర్లే శత్రువులుగా నిలుస్తున్న పరిస్థితులు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు రోజులు సెలవులు ఇవ్వాలని ఆదేశాలు ఉన్నా అమలు చేయడం లేదని విమర్శించారు. ఉన్నతాధికారులు ఈ విషయాలపై దృష్టి సారించి చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో విశాఖ రీజినల్ మేనేజర్ ఎ.అప్పలరాజు, సింహాచలం డిపో మేనేజర్ రాజశేఖర్, ఈయూ జోనల్ అధ్యక్షుడు కె.జె.శుభాకర్, కార్యదర్శి బి.కృష్ణమూర్తి, సహాయ కార్యదర్శి పి.పద్మ, జిల్లా అధ్యక్షుడు కె.ఎస్.సత్యమూర్తి, జిల్లా కార్యదర్శి కేఎస్‌రావు, సింహాచలం డిపో అధ్యక్షుడు కె.వి.రమణ పాల్గొన్నారు.